# గాలి కెరటం

జాగృతి.. 7 ఏప్రిల్, 2003



"ధోబి వస్తే ఈరోజు బట్టలు తీసికెళ్లమని చెప్తారా! రేపు సాయంత్రం నేను క్యాంప్ కెళ్లాలి! అప్పటికి ఐరన్ చేసి తీసుకురమ్మని చెప్పండి!" నా రియాక్షన్ ఏమిటనేది కనీసం చూడకుండా వెళ్లిపోతున్న అతన్ని చూస్తే నాకు అరికాలి మంట నెత్తికెక్కుతోంది.

ఏమిటి! ఇతనికి నేను ఆఫీసులో బోయ్‌గా కనపడుతున్నానా! తన ఇంట్లో పనిమనిషిగా భావిస్తున్నాడా?! ధోబికి బట్టలు వేయడం, సర్వెంటు మేడో చేత ఇల్లు శుభ్రంచేయించమని పనులు పురమాయించడం... అంతా బాగానే ఉంది. ఆయన ఈయన్ని తెచ్చిపెట్టాడు. ఈయనేమో ప్రతివాళ్ళూ తన స్వంతమనుషు లనుకుంటాడు.

"మీ అవుట్‌హౌస్‌ని అద్దెకు ఎందుకిచ్చారు? మొన్నటికి మొన్న ఏమైందనుకున్నావు? నేను మార్కెట్ చేసుకొనివస్తుంటే ఎవరో అమ్మాయిని స్కూటరు మీద ఎక్కించుకొని తీసుకెళుతున్నాడు మీ ఇంట్లో అతను. ఎంతగా దిగజారాడు?!" నా స్నేహితురాలు పరిమళ అన్నమాటలతో- నాకు తల తిరిగిపోయినట్లయింది. ఎప్పుడూ పెరట్లోని ఆ రూమ్ కిటికీ తలుపులు తెరిచి ఉంచుతాడు. వేరే పనిలేనట్లు అందర్నీ గమనిస్తూ ఉంటాడు.

"ఇటువంటి పోకిరీవాళ్ళని ఇంట్లో ఉండనిస్తే మనకెంత నామర్దా?! మనకు మనం మచ్చ తెచ్చుకున్న వాళ్ళమవుతాం!!" బీబీసీలా ఎప్పుడూ సెన్సేషనల్ న్యూస్ మోసుకొచ్చే కాత్యాయిని, యామిని 'మహిళానాడు' సమావేశంలో అందరిముందు నన్ను దెప్పిపొడుస్తూంటే నా తల కొట్టేసినట్లయింది.

"సుచీ! సంజయ్ అని మా ఆఫీసుకి ఫైనాన్సియల్ ఇన్‌ఛార్జిగా కొత్తగూడెం బ్రాంచి నుండి కొత్తగా ట్రాన్స్‌ఫరై వచ్చాడు. రెంట్‌కి ఇల్లు కావాలని అడిగాడు. బ్యాచిలర్! అతను ఒక్కడే ఉంటాడు. మన అవుట్‌హౌస్ ఇస్తే ఎలా ఉంటుందంటావు?"

ఎలాగూ ఖాళీగా ఉంది కదాని- నేను కాదనలేదు ఆయన మాటలకి.

ఆరోజు సాయంత్రం ఇల్లు చూసుకొని వెంటనే అడ్వాన్సు ఇచ్చాడు.

"బామ్మగారూ! మా అమ్మ అచ్చం మీలాగే ఉంటుంది. మీ ఆరోగ్యం ఎలా ఉందిప్పుడు?" చనువుగా పలకరిస్తున్న అతని మాటలతో పులకించిపోతోందామె!!

"ఆరోగ్యానికేం నాయనా... చక్కగా ఉంది. నా బెంగ అంతా మా కోడలు సుచరిత కడుపు పండలేనందుకే! దాని కడుపున రెండుకాయలు కాస్తే మనవళ్ళతో ఆడుకుంటూ, 'కృష్ణా! రామా!' అంటూ ప్రొద్దుపోనిచ్చుకొనేదాన్ని. కాని, ఆ వెంకటేశ్వర స్వామికి మా మీద దయకలగడం లేదు" అనవసరమైన విషయాలు అతనితో చెప్పడం నాకు చాలా అయిష్టాన్ని కలుగజేస్తోంది.

"ఈ విషయాల గురించి ఎక్కువగా ఆలోచించి మనసు పాడుచేసుకోకండి. ఏదో సమయానికి ఇంత తిని, 'కృష్ణా, రామా' అంటూ కాలం వెళ్ళబుచ్చుకోండి. అంతేతప్ప- గుళ్ళూ, గోపురాలంటూ ఎండల్లో ఎక్కువగా తిరిగితే ఆరోగ్యం చెడిపోగలదు!" అతని మాటలు విన్న నాకు మొదట్లో ఏమో అన్పించింది. కాఫీ ఇస్తే త్రాగి బయటకు పోక- దానికి ఎంతో ఉపోద్ఘాతమిచ్చాడు...

"మీ చేతి కాఫీ చాలా మధురంగా ఉంది. ఫిల్టర్ కాఫీలా ఉంది. చక్కెర పెద్దగా లేకపోయినా తీయగా అన్పిస్తోంది. చక్కగా తయారుచేసిన మిమ్మల్ని ఎలా అభిమానించాలో తెలియడం లేదు" అతని 'అతి'ని చూసి చికాకు అన్పించింది. ఇంతకీ మా ఇంట్లో అద్దెకు దిగిన సంజయ్- మా ఆయన ముకుందంగారి పైఉద్యోగి అని తరువాత గాని తెలియలేదు.

"ఈరోజు మా ఆఫీస్‌లో రొటీన్ బిల్స్ పెండింగు పెట్టి పేమెంట్సు ఇవ్వడం లేదని స్టాఫ్ గలాటా చేశారు. సంజయ్‌సార్ చొరవ తీసుకొని, హెడ్‌ఆఫీసుతో మాట్లాడి ప్రాబ్లమ్ సాల్వ్ చేశాడు. షార్ప్‌గా రియాక్టు కావడంతో స్టాఫ్- దేముడంటూ ఆకాశానికి ఎత్తివేస్తే, మేనేజరు చాకచక్యంగా సమస్యను పరిష్కరించినందుకు అభినందించారు!" మా ఆయన తన ఆఫీస్ గొడవల్ని, ముఖ్యంగా సంజయ్ గురించి చెప్పడం ఇంట్లో నాకు ఇబ్బందిగా అన్పిస్తుంటుంది.

"మేడమ్! కొరియర్‌లో ఈరోజు ఇంపార్టెంట్ కవర్సు కొన్ని రావాల్సి ఉన్నాయి. తీసుకొని మీ దగ్గర ఉంచండి. సాయంత్రం తీసుకుంటాను" ఇటువంటి సంజయ్ అభ్యర్థనలు చాలాసార్లు

నాకు చికాకు కల్పించాయి. అవసరం లేకపోయినా, పనికట్టుకొని కల్పించుకు మాట్లాడే అతనిలాంటి మనుషులంటే నాకు జుగుప్స! అందుకే దూరంగా ఉండాలనిపిస్తుంది. ఒకసారి మావారితో చెప్పాను- 'పోర్షన్ ఖాళీ చేయించమని!'

"లేదు సుచీ! సంజయ్ చాలా మంచివాడు, సహృదయుడు. ఒక మనిషిని అంచనా వేయడానికి బయటికి కన్పించే బాహ్య ప్రవర్తన ఒక్కటే కొలమానం కాదని నా అభిప్రాయం!" ముకుందంగారి మాటలు రుచించకపోయినా- ఎక్కువగా మాట్లాడలేకపోయాను.

"బామ్మగారూ! ఈరోజు అంజనేయస్వామి గుడికి వెళ్లివచ్చాను. ఇదిగోనండి ప్రసాదం!" అంటూ అత్తయ్యగారికి ఇస్తే, ఆవిడ ఆనందానికి అంతు ఉండదు.

"సుచరితగారూ! ఈ పూలు మీకు. పూజారి ఇస్తే, మీకు ఇద్దామని తెచ్చాను"

ఆ ముఖంలోని చిరునవ్వుతో చిర్రెత్తుకొచ్చింది నాకు. ఎప్పుడూ తననే గమనిస్తూన్న అతని పనిలేని ధోరణి- నాకు అంతుపట్టడం లేదు. మనసు ఎందుకో కీడును శంకిస్తోంది. అసలు సంజయ్‌ని పట్టించుకోకపోయినా నాతో నవ్వుతూ మాట్లాడాలనీ, పరిచయం పెంచుకోవాలనీ ఆరాటపడతాడు. మాటలు పొడిగించడానికి ప్రయత్నిస్తుంటే లేని చిరునవ్వును ముఖం మీదకు తెచ్చుకొని, అక్కడనుండి తప్పుకొని, లోపలికి వెళ్లి తలుపులు బిగించుకుంటుంటాను.

'అతనికి లేని అలవాటు లేద'ని అందరూ చెబుతోంటే విస్తుపోతుంటాను. ఇంటికి ఎవరెవరో వస్తుంటారు... గంటల తరబడి ఏవేవో మాట్లాడతాడు... ఆ మనిషికి అలుపనేది ఉండదేమో!

తనలాంటి సున్నిత మనస్కులు- మనుషులతో ఎక్కువగా కలవడానికి ఇష్టం చూపరు. తాము, తమ కుటుంబం, సంసార బాధ్యతలు తప్ప- బయట ప్రపంచంలోకి తొంగిచూడడానికి ఉత్సాహం చూపరు. కాని, సంజయ్ ఎప్పుడూ తన గురించి, తన ఆఫీసు గురించి, తాను చేసిన ఘనకార్యాలను ఏకరువు పెడుతుంటాడు. తద్వారా ఇతరుల మెప్పును, పొగడ్తలను ప్రశంసలను అందుకోవాలని ఆశిస్తుంటాడు. కాని, పరాయి వ్యక్తుల స్నేహాన్ని అంగీకరించలేని వ్యక్తిత్వం నాది. ఎవరు ఏమనుకున్నా- నా 'ఈగో'తో నా చుట్టూ నేను కంటికి కనిపించని 'గిరి' గీసుకున్నాను. ఆ లక్ష్మణరేఖను దాటటానికి ఎందుకో నా అంతరంగం అంగీకరించదు.

సంజయ్ ఎవరో నాకు తెలియదు. 'తన భర్త కొలీగ్, తమ ఇంట్లో అద్దెకుంటూన్న వ్యక్తి' అని మాత్రమే తెలుసు! అటువంటి పరాయి మనిషి పరాయిగానే మిగలాలనుకుంటాను. అతన్ని నా మొగుడు గాని, మా అత్తగారు గానీ పొగిడితే నేను జెలసీ ఫీలవుతాను. నాకు నచ్చని మనిషితో చనువుగా ఎవరైనా ఉంటే సహించని మనస్తత్వం నాది మరి!

ముకుందం నా భర్త! ఆయనతో నా జీవితాన్ని మనసా, వాచా పెనవేసుకున్నాను. మేమిద్దరం ప్రేమను పంచుకున్నాం, జీవితాన్ని ఆనందమయం చేసుకున్నాం, సంసారాన్ని స్వర్గతుల్యం గావించుకున్నాం. ముకుందం నన్ను భార్యగా పొందినందుకు మురిసిపోతుంటాడు. నేను అతనితోటి సహచర్యానికి పొంగిపోతుంటాను. మా మధ్యతరగతి 'మేడ్‌ఫర్ ఈచ్ అదర్' సహజీవనంలో సంతానం కలగకపోవడం అనేది ఓ అపశృతి! దానికి మేము లోలోపల బాధపడ్డాం... చివరకు సర్దుకున్నాం! బ్రతికినన్నాళ్లు బ్రతుకుతనాన్ని మధురమయం చేసుకోవాలే గాని, ఆవేదనతో దిగజారిపోకూడదని మనసుకు సర్దిచెప్పుకున్నాం. ఇప్పుడు ఆయనకు నేను, నాకు ఆయన- ప్రేమనందించే పిల్లలం!

మామధ్య ఈ సున్నిత అంశాన్ని ఎవరైనా స్పృశించినా, సానుభూతి ప్రకటించినా– నా మనసు అగ్నిగోళమవుతుంది, ఈ హృదయం కల్లోల మవుతుంది. ఒకప్పుడు సంతానం కోసం, మాతృత్వం కోసం, అర్రులు చాచిన నాలో ఆ ఆరాటం ఇప్పుడు పూర్తిగా హరించుకుపోయింది. చూపించని డాక్టర్లు, చేయని తీర్థయాత్రలు, మొక్కని దేవుళ్ళూ లేకపోయినా... రాన్రాను శిలలా గట్టిపడిన అంతరంగం చివరికి భగవంతుణ్ణే లెక్కచేయని స్థితికి చేరుకొంది.

"సుచరితమ్మా! వచ్చే సంవత్సరానికి నువ్వు పండంటి బిడ్డను ఎత్తుకోవాలి!" అని ఎవరైనా అమ్మలక్కలు విషయాన్ని తలపెడితే– నా హృదయం ఒక్కసారి నీరసం ఆవహించి అతలాకుతుల మవుతుంది. 'వాళ్ళను ఎప్పుడు వదిలించుకొని బయటపడదామా!' అన్పిస్తుంటుంది.

మా ఇంటిలో అద్దెకు చేరిన సంజయ్– మొదటిసారి నన్ను పలకరించాడు. నన్నతను గౌరవించే తీరుకు నా 'ఈగో' సాటిస్‌ఫై అయింది. అందుకే క్లుప్తంగా మాటలు కలిపాను. తరువాత కల్పించుకుని మాట్లాడుతూ, గలగలా విషయాలను ప్రొలాంగ్ చేస్తూంటే చిరాకేసింది.

సాటి మనిషిని ఆరాధించగలిగే వ్యక్తి– స్వేచ్ఛను ప్రేమిస్తాడు. స్వేచ్ఛగా, కల్మష రహితంగా మాట్లాడతాడు. స్వతంత్రంగా వ్యవహరించగలుగుతాడు. సంజయ్‌లోని ఆ స్వేచ్ఛాధోరణే బహుశా నాకు కంటగింపై ఉంటుంది. ఎందుకంటే నన్ను నేను ప్రేమించుకొనే 'ఏకాకి'ని నేను.

ఆఫీసు నుండి వచ్చిన తరువాత మా అత్తగారితో ఓంకార క్షేత్రంలో 'భాగవత సప్తాహం' గురించో, ప్రసన్నాంజనేయ స్వామివారి దేవాలయములో 'హనుమజ్జయంతి' అంటూనో, లేక– కోదండరామ స్వామి మందిరంలో 'ధనుర్మాస కార్యక్రమా'లనో వివరిస్తూంటే– ఆవిడ ఉబ్బితబ్బిబ్బై "అమ్మా సుచీ! సంజయ్‌బాబు వచ్చాడు. ఆ చపాతీలు తెచ్చిపెట్టకూడదూ?" అని ఆర్డర్ వేస్తుంటుంది.

తీరికగా కూర్చొని బాతాఖానీ కొడుతున్నాడనే అక్కసుతో నా బెడ్‌రూమ్‌లో తలుపులు బిగించుకు కూర్చున్నా– అత్తగారి ఆర్డరు పాటించక తప్పదు. ఎవరో ఇంట్లో అద్దెకున్నవాళ్ళపై నాకు కంటగింపు ఎందుకుంటుంది? అసలు అతనెవరో! మేమెవరమో!! కాని, అతని మధురమైన విషయ విశ్లేషణా చాతుర్యం, సెన్స్ ఆఫ్ హ్యూమర్ నాకు అసూయను కలుగజేస్తుంటాయి. ఆ అసూయా ద్వేషాలే నన్ను ఒక్కసారి 'మేడ్ ఉమెన్'గా నిలబెడుతుంటాయి.

"సంజయ్‌సారు చాలా మంచోడమ్మా! 'మా అబ్బాయికి స్కూలుఫీజు కట్టాలి బాబూ' అంటే– ఐదువందలు వెంటనే తీసి ఇచ్చాడు... ధర్మరాజు లాంటోడు!" పనిమనిషి అన్నమాటలు నాకు రుచించలేదు సరికదా... నాకు కర్ణకఠోరంగా అన్పించాయి.

ఇక మావారి సంగతి సరేసరి! ఆఫీసులోనూ, బయగా కూడా సంజయ్‌ని హైలెట్ చేసి మాట్లాడటం... గిట్టనితనంతో గుర్రుగా ఉండే నాకు– మరింత వేదన కల్గిస్తుంటుంది.

సెలవు రోజుల్లో గార్డెన్‌లోని తూగుటుయ్యాలలో కూర్చొని, పిచ్చాపాటి మాట్లాడు కుంటుంటే– మావారితో పాటు సంజయ్‌కి ఏదో అల్పాహారం పెట్టక తప్పేది కాదు.

"సుచరితగారూ! నో ఫార్మాలిటీస్ ప్లీజ్! ఇప్పుడే బయట టిఫిన్ చేసి వచ్చాను" అనేవాడు.

"ఒట్టి ఇడ్లీనే కదా! లైట్‌ఫుడ్... తీస్కోండి" ముకుందంసారు అన్నమాటలకి...

"అలాగని మీరు ఒట్టి టిఫిన్‌తో ఒదిలి పెట్టరనుకోండి. ప్రక్కన ఏదో ఒక స్వీటు, ఒక హాట్ తప్పక ఉంటుంది. తినమని ఊరికే నన్ను మొహమాట పెట్టేస్తున్నారు. తినక తప్పుతుందా మరి!" అని కళ్ళలోకి చూసేవాడు కవ్వింపుగా.

అతను వేసిన పనికిమాలిన జోక్‌కి మావారు పకపకా నవ్వుతారు. అలా చనువుగా మాట్లాడితే నాకు చాలా కంపరంగా ఉంటుందని తెలిసినా పట్టించుకోని అతన్ని ఏమనాలి?

"తర్వాత కాఫీ వద్దన్నా మీరు ఇవ్వడం మానతారా ఏమిటి? మేడమ్‌గారూ... నేను షుగర్ తక్కువ కాఫీని ప్రిఫర్ చేస్తాను" అంటాడు. సంజయ్ మాటల్లో నవ్వు వచ్చేంతటి హ్యూమర్ ఏముందో నాకు తెలిసేది కాదు గాని, మా అత్తగారితో సహా అందరూ ఎంజాయ్ చేస్తారు.

నాకుమటుకు అలా ప్రతిదానికి దేవురించే వారంటే జుగుప్స! కాని, మావాళ్ళు నొచ్చుకుంటారని మిన్నకుండిపోతుంటాను. లేకపోతే అతని చూపులు, మాట తీరు, ప్రవర్తన, అన్నీ డిఫరెంట్‌గా ఉంటాయి. ఊరికే పూసుకు మాట్లాడతాడు. లేని ఆత్మీయతను ఒలకబోస్తాడు. అతని గురించి ఎంతో చెడు విన్నాను. పచ్చి తిరుగుబోతని, ఆడది కన్పిస్తే ఆటగా ప్రవర్తిస్తాడని!

ఆ ఫోన్‌కాల్ అందుకొని తల్లడిల్లిపోయాను. ఒక్కసారి భూమి కంపించి భూగోళమంతా తునాతునకలైపోయిన భావన నెలకొంది నాలో! సొంత పనిమీద గుంటూరు వెళ్లి వస్తుంటే మావారికి యాక్సిడెంట్ అయింది... సివియర్ కండిషనట! కాళ్లూ, చేతులు ఆడటం లేదు... బుర్ర పనిచేయటం లేదు. మా అత్తగారైతే సరేసరి! ఆ ముసలితనంలో ఏదో దేవుడికి దణ్ణాలు పెట్టడం తప్ప మరేమీ చేయలేని అసహాయురాలు!

ఆ రాత్రివేళ ఆపదలో ఆదుకునే ఆత్మీయుని కోసం వెంపర్లాడింది నా మనసు. వెంటనే నిద్రపోతున్న సంజయ్ సహాయాన్ని అర్థించాను. నాకు ధైర్యాన్ని నూరిపోసి, కారుకి ఫోన్ చేసి, చాలా క్విక్‌గా రియాక్ట్ అయ్యాడు.

"ప్రస్తుతానికి ఇంట్లో ఐదువందలు మించి సొమ్ములు లేవు!" అతని ఎదుట మొదటిసారిగా అభిమానం చంపుకొని అన్నాను- వణుకుతున్న స్వరంతో.

"ఏం ఫర్వాలేదు! నేనున్నాను గదా! దిగులుపడకండి. ముకుందంగారికి ఏమీ కాదు! పెద్ద దెబ్బలేవీ తగల్లేదు లెండి. డబ్బుకి మీరు ఇబ్బంది పడనవసరం లేదు. నా దగ్గరిప్పుడు పాతికవేల రూపాయలున్నాయి. కావాలంటే క్రెడిట్ కార్డు ఉపయోగిస్తాను" అన్నాడు హాస్పిటల్‌కి ఫోన్ చేస్తూ!

అతని ఓదార్పు మాటలు నాకు కొండంత ధైర్యాన్నిచ్చాయి. ఆ రాత్రివేళ ఇద్దరు ముగ్గురుకి ఫోన్ చేస్తే ఏదో మొక్కుబడిగా కన్పించి జారుకున్నారంతే!

వెంటనే కారు తీసుకొని ప్రమాద స్థలానికి వెళ్లి, పేషెంటుని తీసుకొని హాస్పటల్‌లో జాయిన్ చేయించడంలో చాలా సహాయం చేశాడు. అతను క్విక్ డెషిషన్స్ తీసుకొని రియాక్టు కాకపోతే- చాలా పెద్దప్రమాదం జరిగివుండేది.

సివియర్ ఫ్రాక్చర్స్‌తో రక్తం కూడా చాలా పోవడంతో బ్లడ్ ఎక్కించవలసి వచ్చింది. బ్లడ్‌బ్యాంక్ నుండి రక్తం తెప్పిద్దామంటే- ఆయన గ్రూప్‌ది దొరకక పోవడంతో చాలా భయపడ్డాను. 'నేనున్నా'నంటూ రక్తం ఇవ్వడానికి ముందుకువచ్చిన సంజయ్‌లో నాకు దేవుడు కన్పించాడు. చివరికి అతని గ్రూప్ రక్తం సరిపోవడంతో మావారిని బ్రతికించాడు. దీనమైన స్థితిలో అల్లాడుతున్న ఆయన కోసం డబ్బు మంచినీళ్లలా ఖర్చు పెడుతుంటే నాలో తిష్టవేసిన, కరుడుగట్టిన ఆ ద్వేషభావం కరిగిపోసాగింది.

సంజయ్ గురించి ఎంత నీచంగా ఆలోచించాను? చెప్పుడు మాటలు విని అతని పట్ల ద్వేషభావాన్ని పెంచుకున్నాను. దానితో మావారు కానీ, అత్తగారు గానీ అతని గురించి ఎంత

ఉన్నతంగా చెప్పినా గాని- మనసు కీడును శంకించేదే గాని, ఆ మనిషిలోని సంస్కారాన్ని ఆనాడు గుర్తించలేకపోయాను.

"డాక్టరు ఇప్పుడే రౌండ్స్ తీసుకొని వెళ్లారు కదా! ఇక మీరు ఇంటికి వెళ్లవచ్చు. పేషెంట్ దగ్గర నేనుంటాను కదా! మీవారి కేమీ భయం లేదు. ఆయన ప్రాణానికి నా ప్రాణం అడ్డు!"

- అదే కవ్వింపు ధోరణిలో అంటుంటే... నా మనసు సిగ్గుతో బిక్కచచ్చిపోతోంది. అపరాధ భావనేదో అంతరంగాన్ని చుట్టుముట్టి అతలాకుతలం చేస్తోంది. అతని పట్ల లేనివి ఉన్నట్లుగా చెప్పి, మనసును విరిచేసిన ఆ మిత్రులంతా ఏమయిపోయినట్లు? ఏదో వచ్చి చూసి వెళుతున్నారే గాని- ఎవరు నిలబడి నాకు ధైర్యాన్నివ్వగలిగారు... ఒక్క సంజయ్ తప్ప?!

అతను చేసిన అపూర్వమైన ఈ సహాయంతో నా హృదయాంతరాల్లో ఎంతో ఉన్నతమైన స్థానాన్ని సంపాదించగలిగాడు. ఒక్కసారి తలచుకొనేసరికి మధురమైన ఆ స్నేహసౌరభం, ఆ మంచితనం, వ్యక్తిత్వం, హద్దుమీరని హృదయ లావణ్యం... తనను ఆకట్టుకుంటుంటే- నా అంతరంగం ఆనందానుభూతితో ఓలలాడసాగింది.

ఇప్పుడు నా హృదయం పశ్చాత్తాపంతో కుమిలిపోతోంది. అతనికి ఎదురు నిలిచి క్షమాభిక్ష నర్థించమని పోరుతోంది. నాలో నెలకొన్న అహంకారపు కఠినశిల కరిగిపోసాగింది.

ఇంతకాలం నాలోని మనిషితనాన్ని తుంగలో త్రొక్కి, సంకుచిత ధోరణితో అతని పట్ల క్రూరంగా ప్రవర్తించాను. ఇప్పుడు తెలియని ఆత్మీయతాభావం హృదయ కుసుమానికి ఊపిరి లూదినట్లయింది.

మావారు హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయిన తరువాత- అవధులు లేని ఆనందంతో నోట మాట కరువయింది నాకు. అతని పట్ల మనసు కృతజ్ఞతా భావంతో నిండిపోయింది.

ఖర్చు పెట్టిన సొమ్ముల్ని తిరిగి ఇస్తుంటే- "ముకుందంగారూ! నాకివ్వవలసిన డబ్బు కంటే మీరు మామూలు స్థితికి చేరుకోవడం నాకు చాలా ఆనందంగా వుంది" అవ్యాజమైన ప్రేమానురాగాలు సంజయ్ మోములో కదలాడుతుంటే చూసి పులకించిపోయాను.

"క్లోజ్ ఫ్రెండ్‌షిప్ ఇన్ టు ఎఫెక్షన్ ఈజ్ ది హ్యూమన్ నేచర్! ఇన్ అదర్ వర్డ్స్ ఇట్ ఈజ్ ది నేచర్ ఆఫ్ ద నేచర్!" ఏకాంతంగా కూర్చొని జ్ఞాపకాల ధ్యానంలో మునిగితేలుతున్న నాకు- ఎదురుపడి అన్న అతని కొటేషన్‌తో మనసు తేలికపడ్డట్లయింది. ఆరోజు నా పుట్టినరోజు కూడా కావడంతో- పరిపక్వమయిన స్నేహభావంతో ఆత్మీయతను పంచిఇచ్చిన గాలికెరటం లాంటి భావ వీచిక సుగంధ పరిమళాలను వెదజల్లినట్లయింది.

"సుచరిత గారూ! మనసు నర్థంచేసుకుంటూ మాట్లాడే మీలాంటి మంచిమనుషుల సాన్నిహిత్య భాగ్యం దొరకడం ఎంత అదృష్టం చెప్పండి!" అతని నోట తీయనిమాట విని పొంగిపోయాను. మహోదాత్తమైన మనసుతో, మానవతా పాశంతో నన్ను కన్విన్స్ చేసిన అపురూప స్నేహితుడు సంజయ్.

"సంజయ్‌కి శ్రీకాకుళం ట్రాన్స్‌ఫరైపోయింది. పదిరోజుల్లో అక్కడికి షిఫ్టు అయిపోవాలిట!" మావారు మోసుకొచ్చిన కబురుతో చాలా కలత చెందాను.

'సంజయ్... నన్ను క్షమిస్తావు కదూ! నేను నా చుట్టూ గిరిగీసుకున్న లక్ష్మణరేఖ ఆనాడు నీ గురించి మంచిగా ఆలోచన చేయనీయలేదు. కాని, మిత్రమా! ఇప్పుడు తప్పు తెలుసుకున్నాను.

ఆ చక్రం నుండి బయటికి వచ్చేస్తూ నిన్ను నిరుపమానమైన స్నేహభావంతో కీర్తిస్తున్నాను. మమ్మల్ని వదిలేసి, మా స్నేహ కుసుమాలను త్రొక్కేసి, మాకు దూరంగా జరిగిపోవడం తగునా?!' ఆర్ద్రంగా రోదించింది నా అంతరంగం.

• • •

కపటం లేకుండా మాట్లాడే అభిమానపూర్వకమైన దృక్కులు నా మనసును పులకింపజేస్తున్నాయి. సంజయ్ మమ్మల్నీ, ఈ ఊరినీ వదిలి దాదాపు సంవత్సరం కావస్తోంది.

ఈ వసంతకాలంలో కనీసం ఒక్క ఫోన్ కూడా చేయలేదు. ఒక్క లెటర్ వ్రాయలేదు. మమ్మల్ని మరచిపోయి ఉంటాడు. బహుశా... అక్కడి కొత్తపరిచయాల ప్రవాహంలో పాతస్నేహాలు మరుగున పడిపోయి ఉండటం సహజం!

"నేను ఇక్కడి నుండి మూవ్ అవుతున్నా. జీవితంలో ఎక్కువ ఏ పొజిషన్‌లో ఉన్నా, స్థితి పెరిగినా ఆదిదంపతుల్లాంటి సుచరిత, ముకుందంగార్లు నా మనోనేత్రంలో నిరంతరం కదలాడుతూనే ఉంటారు" సంజయ్ ఆత్మీయస్వరం నా చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంది.

మానవ సంబంధాలకి వక్రభాష్యం చెప్పే సంకుచిత సమాజం- నచ్చిన మనుషుల్ని అపురూప భావనతో చూడటం తప్పంటుంది. ఆడామగల ఆత్మీయతాదృష్టి- అనురాగ భావకంపనలతో నా హృదయాంతరాన్ని మధురమయం చేస్తోంది.

"నాకు తెలిసిన ఎందరో ఆడవాళ్ళలో రాగద్వేషాలు చూశాను. అహంకారం, పొగరుబోతుతనం చూశాను, సంకుచిత భావన చూశాను. చివరికి ఇతరుల చేత ఆకర్షింపబడాలనే తపన చూశాను. కాని, వీటన్నిటికీ అతీతమైన వ్యక్తిత్వాన్ని మీలో చూశాను. అందుకే హేట్సాఫ్ టు యువర్ గుడ్‌నెస్!" నా పుట్టినరోజునాడు ఒకనాటి అతని మాటలు గుర్తుకువస్తుంటే మనసు పులకించసాగింది. నాకు పదేపదే సంజయ్ గుర్తుకువస్తున్నాడు. అతన్ని చూడాలనిపిస్తోంది. పాషాణమైన హృదయాన్ని కరిగించిన ఆ మాటలు వింటూ ఉండాలనిపిస్తోంది.

ఒక్కసారి పెరట్లోని అవుట్‌హౌస్‌లోకి తొంగిచూశాను... "ఇక్కడే కదూ- సంజయ్ నివసించింది?! ఆ గుమ్మం దగ్గరే కదూ... కూర్చొని రెప్పవాల్చని కళ్ళతో ఆరాధించేవాడు?! ఈ కిటికీ తలుపులే కదూ... ఎప్పుడూ తీసి ఉండేవి?! వాటి వెనుకనే కదూ... నిండుమనసు గుబాళించేది?!" నా పుట్టినరోజునాడు నా హృదయం బరువెక్కినట్లయింది.

ఒక్కసారి ఫోన్ రింగ్ అవడంతో- అటు పరుగుతీశాను. అవతలనుండి ఆ గొంతు వినేసరికి... నా శరీరంలోని అణువణువు ఆనందంతో పులకించింది.

"థాంక్యూ సంజయ్‌గారూ! మీరు మమ్మల్ని వదలి సంవత్సర కాలమైనా గుర్తుపెట్టుకొని, నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు అందజేశారు! నాకు చాలా ఆనందంగా వుంది. మనసు నర్థంచేసుకుంటూ మాట్లాడే మీలాంటి మంచిమనుషుల సాన్నిహిత్య భాగ్యం దొరకడం ఎంత అదృష్టం చెప్పండి! ఐ రిక్వెస్ట్ ప్లీజ్ కీప్ ద ఫ్లాగ్ ఆల్వేజ్ ఫ్లయింగ్!" ఒక్కసారిగా అతని ప్రభావ పరిమళంతో పులకించిన స్నేహకుసుమం సేదదీరినట్లనిపించింది నాకు.